అథ్లెట్ ఉస్సేన్ బోల్ట్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ బీ గోపి
- 9వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

400 మీటర్లలో పరుగులో పాల్గొన్న బాలికలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 30: ట్రాక్ అండ్ ఫీల్డ్ చరిత్రలో గొప్ప అథ్లెట్లలో ఒకరిగా కీర్తి గడించిన ఉస్సేన్ బోల్ట్‌ను స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించి అద్భుత విజయాలను సాధించాలని కలెక్టర్ డాక్టర్ బీ గోపి క్రీడాకారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రీజనల్ స్పోర్ట్ స్కూల్‌లో అండర్-14, 16 ,18 , 20 సంవత్సరాల్లోపు బాలబాలికలకు, పురుషులకు, మహిళలకు నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను శనివారం ఆయన సీపీ సుబ్బారాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో తెలంగాణలోని 33 జిల్లాల నుంచి 1200 క్రీడాకారులు పాల్గొనడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడల్లో పాల్గొన్న భారత క్రీడాకారులు ప్రతి విభాగంలో వరుసగా విజయాలు సాధిస్తున్నారని, క్రీడల్లో రాణించాలంటే ఒలింపిక్‌లో గొప్ప అథ్లెట్‌గా కీర్తి గడించిన ఉస్సేన్ బోల్ట్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం సమున్నతంగా గౌరవిస్తు వారికి మంచి గుర్తింపును, సహాయ సహకారాలను అందిస్తున్నదని తెలిపారు. ఒకప్పుడు క్రీడల వైపు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు విముఖతను చూపించేవారిని, కానీ ఇప్పుడు సరైన ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని, తన కూతురు కూడా క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు జిల్లా యంత్రాంగం తరపున కావాల్సిన సహకారాన్ని అందిస్తామని, క్రీడాకారులు మంచి విజయాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ, క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. క్రీడల్లో పిల్లలు మంచిస్థానాలను అదిరోహించాలంటే ప్రధానంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. అనంతరం 18 సంవత్సరాల బాలికల విభాగంలో 3కేజీ షాట్ పుట్‌లో గెలుపొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎం సంగీతకు బంగారు, మహబూబాబాద్ జిల్లాకు చెందిన హారికకు సిల్వర్, ఖమ్మం జిల్లాకు చెందిన పూజితకు బ్రాంజ్ మెడల్స్ అందించారు. అదేవిధంగా పురుషుల విభాగంలో గద్వాల జిల్లాకు చెందిన వెంకటేశ్‌కు స్వర్ణం, సిద్దిపేట జిల్లాకు చెందిన షేక్ మహబూబ్‌కు సిల్వర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎం అశోక్ రెడ్డికి బ్రాంజ్ మెడల్స్‌ను కలెక్టర్, సీపీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, అర్జున అవార్డు గ్రహీత శోభ, అంతర్జాతీయ క్రీడాకారులు కల్పనారెడ్డి, నాగమణి, డీవైఎస్‌వో రాజవీర్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ, సారంగపాణి, రాజేశ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

లాంగ్ జంప్ వేస్తున్న క్రీడాకారుడు

సౌత్‌జోన్ పోటీల్లో సత్తాచాటుతా

వరంగల్ పట్టణంలో అక్టోబర్‌లో జరిగే సౌత్ జోన్ పోటీల్లో తెలంగాణ కీర్తిని చాటిచెప్పేందుకే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నా. డిస్కస్ త్రోలో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించా. జూనియర్ నేషనల్స్ ఆడిన అనుభవంతో సౌత్‌జోన్ పోటీల్లో సత్తాచాటుతాననే నమ్మకం ఉంది. రాబోయే పోటీల్లో మరింత ప్రతిభ చాటేందుకు కష్టపడుతా. కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో మొదటిసారి జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో జాతీయ పోటీలను తలపించే విధంగా నిర్వహిస్తున్నారు. పోటీల నిర్వహణతో పాటు ఆతిథ్యం బాగుంది. క్రీడాకారులకు, కోచ్‌లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.

- సాయి సబిన్, యాదాద్రి భువనగిరి జిల్లా

ఖచ్చితత్వం కోసం ఫొటో ఫినిష్ టెక్నాలజీ

కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్లో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించడంతోనే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1200 మంది క్రీడాకారులు, కోచ్‌లు, ఆఫీషియల్స్ హాజరవ్వగా వారికి అన్ని ఏర్పాట్లు చేశాం. పోటీల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫొటో ఫినిష్ టెక్నాలజిని ఉపయోగించడం జరుగుతుంది. క్రీడాకారుల ప్రతిభను సెకన్లతో సహా ఈ కెమెరా క్యాప్షర్ చేయనుంది. జిల్లా మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్, సీపీ, క్రీడా సంఘాల సహకారంతో పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

- నందెల్లి మహిపాల్, అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఒలింపిక్స్‌లో ఆడడమే లక్ష్యం

తెలంగాణ తరపున ఒలింపిక్స్‌లో ఆడాలన్నది నా లక్ష్యం. తెలంగాణ కీర్తిని విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి రోజు శ్రమిస్తున్నా. కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో లాంగ్‌జంప్ అండర్-20 విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించా. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇక్కడి వరకు వచ్చా. క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు. ఓ వైపు డిగ్రీ చదువుతూనే క్రీడా సాధన చేస్తున్నా. జాతీయ పోటీల్లో సత్తాచాటిన అనుభవం ఉంది.

-జాకంటి రంజిత, నిజామాబాద్ జిల్లా

పతకం సాధించడం సంతోషంగా ఉంది

నేను చదువుతున్న క్రీడా పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉంది. నా తోటి విద్యార్థులు, కోచ్‌లు, అధ్యాపకుల అభినందనలు నేను మరిచిపోలేను. ఇలాంటి అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. అండర్-16 షార్ట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించా. సౌత్‌జోన్ పోటీల్లో స్వర్ణపతకం సాధించేందుకు మరింత కఠోరంగా శ్రమిస్తా. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా పోటీలు నిర్వహిస్తుండడం కరీంనగర్ క్రీడా పాఠశాల విద్యార్థిగా గర్వపడుతున్న. ఈ విషయంలో నిర్వాహకులకు కృతజ్ఞతలు.

-కే బ్లెస్సీ, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల

నగరంలో అభివృద్ధి పనుల జాతర

రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గంగుల

నగరంలోని 9, 10, 11, 32, 46, 48, 49, 21 డివిజన్లలో రూ. 133 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేశారు. అలాగే, సీతారాంపూర్‌లోని సాయి బాబా ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

-కార్పొరేషన్, సెప్టెంబర్ 30

సీతారాంపూర్‌లోని సాయిబాబా ఆలయ సమీపంలో మొక్క నాటుతున్న మంత్రి గంగుల

44వ డివిజన్‌లో రోడ్డు శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ మెండి శ్రీలత-చంద్రశేఖర్

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- వాడ వాడలా శ్రమదానం
- పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కార్పొరేషన్, సెప్టెంబర్ 30: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శనివారం నగరంలోని పలు డివిజన్లలో రోడ్లు, పార్కులను శుభ్రం చేసే కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని 18వ డివిజన్‌లో గల గౌడ్స్, ముదిరాజ్ కాలనీల్లో కార్పొరేటర్ సుధగోని మాధవీకృష్ణాగౌడ్ శ్రమదానం చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ చేపట్టారు. 44వ డివిజన్‌లో కార్పొరేటర్ మెండి శ్రీలత-చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శర్మనగర్‌లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాలను శ్రమదానంతో శుభ్రం చేశారు. అనంతరం డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించడానికి విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ, ప్రజలు తమ ఇండ్లల్లోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బంది తీసుకువచ్చే వాహనాల్లో వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్, జవాన్లు దీకొండ లక్ష్మణ్, ప్రసాద్, ఏఎన్ఎం విజయరాణి, ఆర్పీలు విజయ, రోజ, నిజాంపేట్ కపిల్, బైరం కుమార్, గాడం నరేందర్, ఆయా డివిజన్ల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో రోడ్డు ఊడుస్తున్న కార్పొరేటర్ సుధగోని మాధవీకృష్ణాగౌడ్, డివిజన్ ప్రజలు

యువతను అప్రమత్తం చేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య

కలెక్టరేట్, సెప్టెంబర్ 30: యువతను మత్తు పదార్థాల పట్ల అప్రమత్తం చేస్తూ, వారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పిల్లలు మత్తు పదార్థాలకు బానిస కాకుండా చేపట్టే చర్యలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగిస్తున్న వారు తెలియకుండానే నేరాలకు, విచక్షణ రహిత పనులకు పాల్పడుతారని అన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నిషేధించడానికి జిల్లా వైద్యాధికారులు, డ్రగ్స్ కంట్రోల్ విభాగం సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కలెక్టర్ డాక్టర్ బీ గోపి మాట్లాడుతూ, అల్కాహాల్, డ్రగ్స్ తదితర వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో యువతీయువకులు, పిల్లలు డ్రగ్స్‌కు బానిస కాకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు మాట్లాడుతూ, జిల్లాలో వైద్య, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో ప్రత్యేకంగా నార్కోటిక్, టాస్క్ ఫోర్స్ విభాగాలను డ్రగ్స్ వ్యాప్తి చెందకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా, రేపటి భావితరం నిర్వీర్యం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంతి, జిల్లా వైద్యాధికారి లలితా దేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, లేబర్ కమిషనర్ రమేశ్ బాబు, అడిషనల్ పోలీస్ కమిషనర్ రాజు, అసిస్టెంట్ కమిషనర్ విజయ్‌కుమార్, 1098 కోఆర్డినేటర్ సంపత్, డీడబ్ల్యూవో సరస్వతి, అర్బన్ సీడీపీవో గుర్రం ఉమారాణి, రూరల్ సీడీపీవో సబిత, మండల విద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో శ్రమదానం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కే రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పూజ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. అధ్యాపకులు సతీశ్ రెడ్డి, ఎండీ నహీం, ఉమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, రఖీబ్, విద్యార్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో ఊడుస్తున్న అధ్యాపకులు